## క్లుప్తంగా

### డీఎస్సీ అభ్యర్థులకు భోజనం ఏర్పాటు



భోజనం వడ్డిస్తున్న డీఈవో ప్రణిత

**ఆదిలాబాద్‌టౌన్:** డీఎస్సీ అభ్యర్థులకు పీఆర్టీయూ సంఘం ఆధ్వర్యంలో భోజనం ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతోంది. ఇందులో భాగంగా గురువారం జిల్లా నలుమూలల నుంచి హాజరైన అభ్యర్థులు, వారి కుటుంబీకులకు అన్నదానం చేశారు. కార్యక్రమాన్ని జిల్లా విద్య శాఖాధికారి ప్రణిత ప్రారంభించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణకుమార్, నర్సింహా స్వామి పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ భవనం ప్రారంభం

**తాంసి:** భీంపూర్ మండలంలోని ఇందూర్‌పల్లి గ్రామంలో ఐటీడీఏ నిధులతో నిర్మించిన నూతన అంగన్‌వాడీ భవనాన్ని గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముంతాజ్ బేగం ప్రారంభించారు. అనంతరం చిన్నారులతో సామూహిక బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్, మాజీ సర్పంచ్ దాదారావు, అంగన్‌వాడీ టీచర్‌లు పద్మ,నజీమా, కవిత, సునీత పాల్గొన్నారు.

### కుమురం సూరు వర్ధంతి అధికారికంగా నిర్వహించాలి

**ఉట్నూర్‌రూరల్:** జోడేఘాట్ వీరుడు కుమురం భీం అనుచరుడు కుమురం సూరు వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని కుమురం సూరు యువసేన జిల్లా గౌరవ అధ్యక్షుడు టేకం వినాయక్, జిల్లా అధ్యక్షుడు కొమురం రాజు కోరారు. ఈసందర్భంగా వారు గురువారం మాట్లాడుతూ.. ఐటీడీఏ ద్వారా నిధులు సమకూర్చడంతో పాటు అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కొలాం సేవా సంఘం భవనంలో నిర్వహించే సమావేశానికి ప్రజలు హాజరు కావాలని కోరారు. సమావేశంలో విజయ్‌కుమార్, ఆత్రం మానిక్‌రావు, టేకం తుకారాం పాల్గొన్నారు.

### నకిలీ బోనఫైడ్ సమర్పించిన అభ్యర్థిపై చర్యలు తీసుకోవాలి

**ఆదిలాబాద్‌టౌన్:** ఎస్జీటీ మరాఠీ మీడియంలో నకిలీ బోనఫైడ్ సమర్పించిన అభ్యర్థిపై చర్యలు తీసుకోవాలని పలువురు అభ్యర్థులు పేర్కొన్నారు. గురువారం జిల్లా విద్య శాఖాధికారి ప్రణితకు వినతిపత్రం అందజేశారు. మెరిట్ లిస్టులో ఉన్న అభ్యర్థి మహారాష్ట్రలో విద్యాభ్యాసం చేయడం జరిగిందని, ఆ అభ్యర్థి ఆదిలాబాద్ పట్టణంలోని యూపీఎస్ భుక్తాపూర్‌లో చదివినట్లు నకిలీ బోనఫైడ్ సమర్పించినట్లు తెలిపారు. బోనఫైడ్ అందించిన ఉపాధ్యాయులపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. మెరిట్ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

### పండ్లు పంపిణీ

**ఆదిలాబాద్‌టౌన్:** జిల్లా కేంద్రంలోని కేఆర్‌కేలో గల వృద్ధాశ్రమంలో అల్ కరీం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు వృద్ధుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. వారికి అండగా ఉంటామని పేర్కొన్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ఆదిల్, సభ్యులు పాల్గొన్నారు.

### సమావేశం విజయవంతం చేయండి

**ఆదిలాబాద్‌రూరల్:** ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో నిర్వహించే ఎమ్మార్పీఎస్, అన్నిఅనుబంధ సంఘాల కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేష్ కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాలాజీనగర్‌లో మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్లు, వర్గీకరణ రాష్ట్రాలకు అధికారాన్ని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆగస్టు 1న తీర్పు ఇచ్చి రెండు నెలలు గడుస్తుందన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతో మాదిగ ఉప కులాలకు అన్యాయం చేస్తుందని ఆరోపించారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

### 'తులం బంగారం ఇవ్వాలి'

**నేరడిగొండ:** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తులం బంగారం అందజేసి పేదలను ఆదుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 23 మంది లబ్ధిదారులకు రూ.1లక్ష 116 చొప్పున చెక్కులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులతో పాటు హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొలువుదీరిన దుర్గామాత

**తాంసి/బోథ్/ఇంద్రవెల్లి:** జిల్లా వ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల భక్తులు దుర్గామాత విగ్రహాలను శోభాయాత్రలతో మండపాల వద్దకు తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పలువురు భక్తులు దుర్గామాత మాలధారణ గావించారు. దీంతో ఆయా గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.



తాంసి: ఊరేగింపుగా దుర్గామాత విగ్రహాన్ని తీసుకువస్తున్న భక్తులు



బోథ్‌లో కొలువుదీరిన దుర్గామాత



ఇంద్రవెల్లి: సాయినగర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



బోథ్: దుర్గామాత మాల ధరించిన భక్తులు

# గ్రామాల అభివృద్ధికి కృషి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ఇంద్రవెల్లి:** గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండలంలోని అంజీ, వాల్గోండ, హీరపూర్, భీంజితండా, పిట్టబొంగరం గ్రామాల్లో సందర్శించి, పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాలను ప్రారంభించారు. ప్రజల దూరభారం తగ్గించేందుకు గ్రామాల్లో రేషన్ దుకాణాలను ప్రారంభించడం జరిగిందన్నారు. అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తుందన్నారు. రోడ్లు, తాగునీరు, ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముఖడే ఉత్తం, ఎండీ మసుద్, జితేందర్, సోమోరే నాగోరావ్, తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌లో పలువురి చేరిక**

**ఇంద్రవెల్లి:** మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల ఆదివాసీ నాయకులు గురువారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇంద్రవెల్లి మాజీ సర్పంచ్ కొరెంగా సుంకట్‌రావ్, మాజీ వైస్ ఎంపీపీ పద్వాల్ గోపాల్‌సింగ్,



రేషన్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మాజీ ఎంపీటీసీ జుగ్నాక్ కాశీరాం, తుడుందెబ్బ మాజీ మండల అధ్యక్షుడు జుగ్నాక్ భరత్‌తో పాటు 60 మంది ఆదివాసీ పెద్దలు, యువకులు పార్టీలో చేరారు.

**మీ సేవ కేంద్రాలతో ఎంతో మేలు**

**ఉట్నూర్‌రూరల్:** గ్రామీణ ప్రాంతాల్లో మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని దంతన్‌పల్లి గ్రామంలో మీ సేవ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఖయ్యూం, చంద్రయ్య, దాసండ్ల ప్రభాకార్, ముబీన్ పాల్గొన్నారు.

# బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

**నేరడిగొండ:** మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో గ్రామ పంచాయతీ బాధ్యతగా వ్యవహరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎన్‌వి రమణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రతీనెల మూడు సార్లు మంచినీటి సరఫరా ట్యాంకులను శుభ్రపర్చాలని సూచించారు. గ్రామాల్లో ఎక్కడైన పైపు లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. గ్రామపంచాయతీ సహాయకులకు నాలుగు రోజుల శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఎంపీడీవో రాజ్‌వీర్, ఎంపీవో లక్ష్మణ్, ఏఈ సతీష్, ట్రైనర్ మారుతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమణ

# వన్యప్రాణులను సంరక్షించాలి

**నేరడిగొండ:** ప్రతిఒక్కరూ వన్యప్రాణులను సంరక్షించాలని సిరిచెల్మ రేంజ్ అధికారి అరుణ అన్నారు. వన్యప్రాణి సప్తా కార్యక్రమంలో భాగంగా గురువారం కుంటాల జలపాతం వద్ద పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా సిబ్బందితో కలిసి ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్, చెత్తను శుభ్రం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వన్యప్రాణులకు హాని కలిగించవద్దని సూచించారు. వన్యప్రాణుల ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో కుంటాల సెక్షన్ ఎఫ్ఎస్‌వో వసంత్ కుమార్, ఎఫ్‌బీవోలు సచిన్, సందీప్, పోచం, ఈడీసీ చైర్మన్ నర్సయ్య, వైస్ చైర్మన్ రమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



చెత్తను శుభ్రం చేస్తున్న అధికారులు, సిబ్బంది

# మంత్రి సురేఖకు క్షమాపణ చెప్పాలి



కేటీఆర్ ఫ్లెక్సీ దహనం చేస్తున్న నాయకులు

- కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేటీఆర్ ఫ్లెక్సీ దహనం

**కైలాస్‌నగర్:** రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవభవన్ వద్ద ర్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కేటీఆర్‌కు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేకస్తూ.. ఫ్లెక్సీని దహనం చేశారు. ఈ సందర్భంగా మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఆశమ్మ మాట్లాడుతూ.. పెళ్లైయింది కల్యాణలక్ష్మి ఎప్పుడంటూ ఒక ఆడపడుచు మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన కేటీఆర్ వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. మహిళలనే గౌరవం లేకుండా తప్పుడు ఆరోపణలు చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు సోనియా, షబానా, జుబేదా, ఖమర్ బేగం, అఫ్రోజా, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, గిమ్మ సంతోష్, గుడిపల్లి నగేశ్, లోక ప్రవీణ్ రెడ్డి, కలాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.




ఫిర్యాదు చేస్తున్న సుగుణ, నాయకులు


**పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు**

**ఉట్నూర్‌రూరల్:** కాంగ్రెస్‌పై అసత్య ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని ఉట్నూర్ పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించేందుకు నేరపూరిత కుట్ర, నిరాధారమైన, నిర్లక్ష్యపూరిత ఆరోపణలు చేశారని మండిపడ్డారు. ఆమె వెంట నాయకులు రాజవ్వ, కౌసల్య, నీలాబాయి, అన్నపూర్ణ, మల్లు, కవిత, గౌరుబాయి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే



వివరాలను సేకరిస్తున్న అధికారులు



సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

**ఇచ్చోడ:** మండలంలోని అడేగామ(బి)లో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను ఎంపీడీవో లక్ష్మణ్ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబసభ్యుల వివరాలు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో 220 కుటుంబాలు ఉన్నాయని, వివరాలను సేకరించి, ఆన్‌లైన్ ద్వారా కలెక్టర్‌కు పంపనున్నట్లు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ జాదవ్‌రమేశ్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

**కైలాస్‌నగర్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డులకు సంబంధించిన క్షేత్రస్థాయి సర్వే గురువారం ప్రారంభమైంది. పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్ కాలనీని ఎంపిక చేశారు. దీంతో ఐదు ప్రత్యేక బృందాలు కాలనీలోని ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమాచారాన్ని సేకరించారు. మొబైల్ ఫోన్లలో కుటుంబసభ్యుల ఫొటోలు సేకరించారు. సర్వేను మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, ఆర్డీవో వినోద్ కుమార్‌లు పరిశీలించారు. కాలనీవాసులతో మాట్లాడి వివరాల సేకరణ తీరును ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా వివరాలను పకడ్బందీగా సేకరించాలని సర్వే సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా బతుకమ్మ సంబురాలు

**బజార్‌హత్నూర్:** మండల కేంద్రంలో మహిళలు బతుకమ్మ పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే రంగురంగుల పూలతో బతుకమ్మలను పేరించి గౌరమ్మకు పూజలు చేశారు. ఆటపాటలు, కోలాటం, డీజే పాటలకు నృత్యాలు చేశారు. అనంతరం కడెం నదిలో నిమజ్జనం చేశారు.

**తాంసి:** ఆడబిడ్డల పండుగ చెప్పుకునే బతుకమ్మ సంబురాలు గ్రామాల్లో మొదలయ్యాయి. ప్రధాన కూడళ్ల వద్ద బతుకమ్మ బావి తవ్వారు. బావి చుట్టూ గద్దెలతో పాటు సూర్య, చంద్ర గద్దెలను మట్టితో ఏర్పాటు చేశారు. వాటి చుట్టూ ముగ్గుల వేసి బతుకమ్మ బావిని సిద్ధం చేశారు. అనంతరం చేన్నంగి చెట్టును ప్రతిష్ఠించి దీపారాధన చేసి బతుకమ్మ పండుగను ప్రారంభించారు.

**నేరడిగొండ:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. కళాశాల లెక్చరర్లు, విద్యార్థినిలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. డీజే సౌండ్ మధ్య బతుకమ్మల చుట్టూ కోలాటాలు వేస్తూ.. నృత్యం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షభాన తరన్నుమ్, లెక్చరర్లు సుజాత, విద్యార్థినులు పాల్గొన్నారు.

**బోథ్:** మండల వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. గురువారం మండల కేంద్రంలోని వాగ్దేవి కళాశాలలో బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి గౌరమ్మకు పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రవీణ్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కార్తీక్, దీప, అధ్యాపకులు పాల్గొన్నారు.



బతుకమ్మలతో మహిళలు



ప్రభుత్వ కళాశాలలో..



బతుకమ్మలతో విద్యార్థినులు

# గ్రంథాలయంలో పుస్తకాల కొరత

- కనీస వసతులు కరువు
- ఇబ్బంది పడుతున్న యువత, నిరుద్యోగులు
- బోథ్ గ్రంథాలయాన్ని పట్టించుకోని ప్రభుత్వం



గ్రంథాలయంలోని పాత పుస్తకాలు



ఇరుకు గదిలో బోథ్ గ్రంథాలయం

**బోథ్:** గ్రంథాలయాలు విద్యార్థులు, నిరుద్యోగులకు ఆలయాల వంటివి. ఇవి విజ్ఞానాన్ని పెంచే ఆలయాలని పెద్దలు చెబుతుంటారు. పుస్తక పఠనం వల్ల విజ్ఞానం వస్తుందని, పుస్తకాలను చదవడంతో జీవితాల్లో మార్పు వస్తుందంటారు. ఈ నేపథ్యంలో వివిధ పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు కొనుగోలు చేసి చదివే స్తోమతలేక నిరుద్యోగ యువత ఇబ్బంది పడుతున్నారు. గ్రంథాలయాల్లో అన్నిరకాల పుస్తకాలు ఉంటే చదువుకునే అవకాశం ఉంటుందని ఆశించిన నిరుద్యోగ యువతకు నిరాశే ఎదురవుతోంది. మారిన సిలబస్‌కు అనుగుణంగా కొత్త పుస్తకాలు అందుబాటులోకి తీసుకువస్తే మేలు జరుగుతుందని నిరుద్యోగులు అభిప్రాయపడుతున్నారు.

**అందుబాటులో లేని పుస్తకాలు..**

బోథ్ మండల కేంద్రంలోని గ్రంథాలయంలో పుస్తకాలు లేక నిరుద్యోగల యువత ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని 33 గ్రామ పంచాయతీల నుంచి నిరుద్యోగులు, యువకులు గ్రంథాలయానికి వస్తుంటారు. గ్రంథాలయం ఏర్పడి 30 యేళ్లు గడిచింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకముందు గత 30 ఏళ్ల క్రితం ఉన్న పుస్తకాలు దాదాపు 10 వేల వరకు ఉన్నాయి. ఈ పుస్తకాలల్లో పలు నవలలు, తెలుగు సాహిత్యం, హిందీ, వివిధ రచనలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కొత్త పుస్తకాలు రాలేదు. వివిధ ఉద్యోగాలకు అవసరమగు ఎటువంటి పుస్తకాలు లేవు. నేటి పోటీ ప్రపంచానికి అవసరమగు పుస్తకాలను గ్రంథాలయంలో ఉంచాలని యువత కోరుతున్నారు.

**అందుబాటులో లేని పోటీ పరీక్షల పుస్తకాలు**

ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ కోసం ఇటీవలే జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. నిరంతరంగా ఉద్యోగాల ప్రకటనలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో యువత, నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారు. అయితే గ్రంథాలయాల్లో వివిధ పోటీ పరీక్షలకు చెందిన పుస్తకాలు లేకపోవడం, చదవడానికి స్థలం లేకపోవడంతో నిరుద్యోగులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పోటీపరీక్షల పుస్తుకాలు అందుబాటులో ఉంచాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

### పుస్తకాలకు ప్రాధాన్యం ఇవ్వాలి



గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను ఉంచేందుకు ప్రాధాన్యమివ్వాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం ఉద్యోగాల కోసం నోటిఫికేషన్లను విడుదల చేస్తోంది. గ్రామీణ ప్రాంతంలో ఉన్న నిరుద్యోగులు గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను చదవుకోవడానికి ఉపయోగపడతాయి.

– ఓస సాయి కుమార్, బోథ్

### సౌకర్యాలు కల్పించాలి



గ్రంథాలయంలో కనీస సౌకర్యాలు లేవు. చిన్న గదిలోనే గత కొన్నేళ్లుగా గ్రంథాలయం నడుస్తోంది. చాలా మంది నాయకులు గ్రంథాలయం కోసం నూతన భవనాన్ని నిర్మిస్తామని చెప్పారు. కానీ ఇప్పటివరకు సొంత భవనం లేదు. అద్దె గదిలోనే కొనసాగుతోంది.

– ఆకాష్, బోథ్

## సేవా కార్యక్రమాలు అభినందనీయం

**ఉట్నూర్‌రూరల్:** ఉట్నూర్ ఏజెన్సీ గ్రామాల్లో సాడిగే రాజగోపాల్ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన సాడిగే రాజగోపాల్ అవార్డు అందుకున్న విషయాన్ని తెలుసుకున్న బండి సంజయ్ గురువారం కరీంనగర్‌లో ఆయనను సన్మానించారు. అదే విధంగా ఏజెన్సీ ప్రాంత స్థితిగతులు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



సన్మానిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్